కథా కౌముది

# యాత్ర

జి.వి.రమణ

**కుడిచేతి వేళ్ళకో** మూడు ఉంగరాలూ, ఎడమ చేతి వేళ్ళకో రెండు ఉంగరాలూ, భృకుటిమీద కుంకుడు గింజంత కుంకుమ బొట్టూ, నున్నగా గీసిన గడ్డం, తీరుగా దువ్విన జుట్టూ, అందంగా సర్దినట్టున్న మీసకట్టూ, చామనఛాయ, అయిదున్నరడుగుల ఎత్తూ. తెలియని వాళ్ళకి బలరాం గురించి చెప్పాలంటే ఈ వర్ణనతోపాటు అతడు ఏదో పొందడానికి ఎప్పుడూ ఆత్రపడుతూ ఉంటాడని చెప్పడం కూడా అవసరం.

ఒరిస్సాలోని భువనేశ్వర్ ట్రైనింగ్ కాలేజీలో మా సంస్థవారు నన్ను ఒక ప్రత్యేకమయిన పనిలో శిక్షణ నిమిత్తం పంపినప్పుడు పరిచయమైన వ్యక్తి బలరాం. మాటల సందర్భంలో అతనికి పదోన్నతి పొందాలన్న తీవ్రమయిన కాంక్ష ఉన్నట్లు అర్థమయింది. అతడితో ఒక గంట గడిపితే ఆ విషయం ఎవరికైనా అర్థమయిపోతుంది. అది పొందడానికే అతడు జ్యోతిష్యాన్ని నమ్ముకుని వేళ్ళనిండా ఉంగరాలు పెట్టుకుని, జోస్యులు చెప్పిన నానా పద్ధతుల్లో దేవుణ్ణి ఆరాధిస్తాడనీ, కొండకచో పీడిస్తాడనీ నాకు అనిపించింది.

పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా మర్నాడు మా శిక్షణా తరగతులకు సెలవ.

"రేపు ఉదయాన్నే బయలుదేరి పూరీ వెళ్దాం వస్తారా? ఇక్కడినుండీ ఓ అరవై కిలోమీటర్లుంటుంది. అక్కడ రేపు జరిగే రథయాత్ర చాలా గొప్పగా ఉంటుంది. ఏకంగా మూడు రథాలు - ఒకటి బలభద్ర, రెండు సుభద్ర, మూడు జగన్నాథలను ఒకరి రథం వెంట మరొకరి రథం ఊరేగిస్తారు.

ఆ రథాల తాడులాగుతూ కనీసం తాకుతూనైనా ఏవైనా కోరికలు కోరుకుంటే ఆ కోరికలు తప్పక తీరుతాయి, తద్వారా కైవల్యం కూడా ప్రాప్తిస్తుంది. దానికోసమే నేను ప్రత్యేకంగా ఈ వారం ట్రైనింగ్ బ్యాచ్‌కి హెడ్డాఫీసులో నా ఫ్రెండుతో మాట్లాడి ఈ ట్రైనింగ్ వేయించుకున్నాను. రైలు ఛార్జీలు మిగులుతాయి కదా అని. ప్రత్యేకంగా వచ్చి వెళ్ళాలంటే హైదరాబాద్ నుండీ చాలా ఖర్చు అవుతుంది. అందుకని" తను చెప్పదలచుకుంది చెప్పాడు బలరాం.

చారిత్రకంగా జగన్నాథ రథయాత్ర ఒక విశేషమయిన ప్రాధాన్యత కలిగిన విషయం కావడం చేతా, దైవికంగా ఆ సమయానికే అక్కడ ఉండటం తటస్థించడం చేతా, పైగా ఒంటరిగా కాకుండా ఒక తోడుకూడా ఉన్నాడన్న ఉత్సాహంతో "సరే" అన్నాను. అయితే నాకు దైవం మీద నమ్మకం ఉన్నా, రథం తాళ్ళు లాగితేనో, ఉంగరాలతోటో, తాయెత్తుల తోటో కోర్కెలు తీరుతాయన్న నమ్మకంగానీ, తీర్చుకోవాలన్న ఆరాటంగానీ లేవు.

మర్నాడు ప్రొద్దున్నే బస్సుకి బయలుదేరాం. బస్‌స్టేషన్ విపరీతమయిన రద్దీగా ఉంది. అందులో మూడొంతులమంది రథయాత్రకోసం బయలుదేరిన వాళ్ళే. ప్రత్యేకమయిన బస్సులు చాలా వేసినా, బస్సుల్లో చాలామంది నిలబడి కూడా ప్రయాణిస్తున్నారు.

మొత్తానికి అతి కష్టమ్మీద బస్సెక్కాం. పూరీకి ఇద్దరికీ నేనే టిక్కెట్లు తీసుకున్నాను. దాదాపు గంటన్నర తర్వాత పూరీ చేరింది బస్సు.

జగన్నాధాలయం ఉన్న వీధి వీధంతా ఇసుక వేస్తే రాలనంత జనం ఉన్నారు. అక్కడక్కడా మైకుల హోరు. రకరకాల సంకీర్ణ ధ్వనులతో మహా కోలాహలంగా ఉంది. ఆ జనాన్ని చూస్తే నాకు క్లాస్ట్రోఫోబియా (ఎక్కువ జన సమూహాల్లో కలిసి ఉన్నప్పుడు కలిగే భయం)లాంటిది కలిగి తెలీని చిన్న వణుకు పుట్టించింది. అదృష్టవశాత్తూ ఆ వీధిలోనే గుడి ఎదురుగా రథాలు నిలిపి ఉంచిన చోటుకి కాస్త దగ్గరలోనే మా బ్రాంచి ఉంది. అక్కడి స్టాఫంతా ఆ రోజు ఆఫీసు తెరిచి, ఎదురుగా ఒక చలివేంద్రం పెట్టి ఆ సంబరం చూడటానికి వచ్చిన వాళ్ళకి మంచినీళ్ళూ, షర్బత్తులూ వితరణ చేస్తున్నారు. కష్టం మీద జనాన్ని తోసుకుంటూ ఇద్దరమూ ఆఫీసు దగ్గరకెళ్ళి మమ్మల్ని పరిచయం చేసుకున్నాం. వాళ్ళుకూడా సాదరంగా మమ్మల్ని లోపలికి తీసుకువెళ్ళి కూర్చోవడానికి కుర్చీలూ, త్రాగడానికి నీళ్ళూ ఇచ్చి ఆదరించారు.

ఒక పదినిమిషాలు వాళ్ళతో పిచ్చాపాటి మాట్లాడాక, "ఇక రథయాత్ర ప్రారంభం అయ్యేలా ఉంది, మైక్‌లో కామెంటరీ చెబుతున్నారు. అక్కడ జరిగే సాంప్రదాయక క్రతువులన్నీ పూర్తయినట్లున్నాయి. నేను వెళ్ళి వస్తాను, మీరూ వస్తారా?" అడిగాడు బలరాం.

"జనాన్ని చూస్తే నాకు భయం, ఇందాక వచ్చేటప్పుడే నేను రథాల వైపు చూస్తూ మనసులోనే దేవుడికి నమస్కరించుకున్నాను, మీరు వెళ్ళరండి, వచ్చేవరకూ నేనిక్కడే ఉంటాను" అన్నాను.

"ఈ రథయాత్రలప్పుడు జేబు దొంగతనాలు చాలా ఎక్కువ, నేను వచ్చేదాకా నా పర్సు మీ దగ్గర ఉంచుకోండి" అంటూ జేబులో పర్సు తీసి నాకిచ్చి, తన ఫుల్‌హాండ్ షర్ట్ చేతులు బాగా పైకి మడిచి జనంలోకి దూసుకువెళ్ళాడు బలరాం. వాళ్ళందరినీ దాటుకుని రథపు తాడు దొరకపుచ్చుకోవడమంటే ఆ సమయంలో సామాన్యుల వల్ల అయ్యే పనిలా కనబడలేదు నాకు. కానీ బలరాంకి ప్రమోషన్ రావాలన్న పట్టుదలా ఈ ఆచారం మీద ఉన్న నమ్మకం ఎక్కడలేని బలాన్నీ ఇస్తోందనిపించింది.

ఇంతలో ఆఫీసు ప్యూను వచ్చి, "సార్ మీరిక్కడ కొత్తకదా, ఈ సమయంలో ఇక్కడ మధ్యాహ్నం భోజనం దొరకడం కష్టం. పక్కన మనకి తెలిసిన చిన్న హోటల్ వాడున్నాడు. మీకు కావాలంటే భోజనం పార్సెల్ తెచ్చిపెడతాను" అన్నాడు.

సమయానికి సరిగ్గా గుర్తుచేశాడనుకుంటూ, "ఎంత?" అని కనుక్కుని ఇద్దరికీ రెండు భోజనాలకి సరిపడా డబ్బులిచ్చి పంపాను. ఓ అరగంటలో అతడు మా భోజనాలు తెచ్చి పెట్టాడు. ఇంతలో బయట జయజయధ్వానాలు మిన్నుముట్టుతున్నట్లు వినిపించడంతో అందరం బయటికి వచ్చాం. యాత్ర ప్రారంభమయింది. నేను దూరంనుంచే జగన్నాధుడికి నమస్కరించుకుని, రథాన్ని లాగుతున్నట్లు ఊహించుకుంటూ మనసులోనే ఆ అనుభూతి చెందాను.

ఓ గంటన్నర గడిచాక బలరాం చెమటలు కక్కుతూ మహా సంతోషంగా తిరిగి వచ్చాడు.

"ఈసారి మీ ప్రమోషన్ ఖాయమనుకుంటాను" అన్నాను.

"దాదాపు" అంటూ ఇందాక ఇచ్చిన పర్సు ఇవ్వమని అడిగాడు. నేను జాగ్రత్త చేసిన పర్సు అతని చేతికిచ్చాను. వెంటనే అది తెరిచి అందులో ఉన్న డబ్బులన్నీ ఉన్నయో లేదో అన్నట్లు లెక్క చూసుకుని సంతృప్తిగా జేబులో పెట్టుకున్నాడు.

ఎందుకో అతడి చేష్ట తను నన్నొక జేబుదొంగలా అనుమానిస్తున్నట్టుగా లెక్కపెట్టడం నా మనస్సుని చివుక్కుమనిపించింది. 'రథం లాగుతున్నప్పుడు ప్రమోషన్‌తో పాటు, పర్సుకూడా జేబు దొంగలకి దొరకకుండా ఉండాలని కోరుకోవచ్చుకదా, దేవుడి మహత్యం ఇప్పుడే తెలిసిపోయేది' అనుకున్నాను అతన్ని మనసులో చీదరించుకుంటూ.

మనసు ఏదో తెలియని భారంతో నిండిపోయింది. 'కొంతమంది అంతేలే' అని సర్ది చెప్పుకుని, తెప్పించిన భోజనం పార్సెల్ ఇచ్చాను.

భోజనాలయ్యాక తిరిగి భువనేశ్వర్ బయలుదేరాం. బస్ ఛార్జి మళ్ళీ నేనే భరించాను. ఇటువంటి ఆర్థిక విషయాలేవీ అతణ్ణి స్పందింపజేసినట్లు నాకు తోచలేదు.

ట్రైనింగ్ పూర్తయి ఎవరి ఊళ్ళకి వాళ్ళం వెళ్ళిపోయాం.

ట్రైనింగ్ మాట ఎలా ఉన్నా, ప్రమోషన్ కోసం బలరాం యాత్ర మాత్రం దిగ్విజయంగా పూర్తయింది.

మరో నెలరోజుల్లో ప్రమోషన్ కోస్మ మా సంస్థ పరీక్షలూ, ఇంటర్వ్యూలూ నిర్వహించింది.

ఆ రోజు ఫైనల్ సెలెక్షన్ లిస్టు ఎనౌన్స్ చేశారు.

ఆ లిస్టులో బలరాం పేరు ఉందా లేదా అని ఆతృతగా పైనుండి క్రిందికి జాగ్రత్తగా చూస్తే జగన్నాధ రధం తాడు అతణ్ణి పదోన్నతుణ్ణి చెయ్యలేకపోయిందని అర్ధమయ్యింది. అయినా అతడి నోటిద్వారానే ఆ మాట విందామని వెంటనే ఫోన్ తీశాను.

యాదృచ్ఛికమో, ఏమోగానీ సరిగ్గా అదే సమయానికి బలరాం నాకు చేస్తున్నాడు. కాల్ రిసీవ్ చేసి "హల్లో" అన్నాను.

"హలో సార్, ప్రమోషన్ ఫైనల్ లిస్ట్ వచ్చింది చూశారా మీ పేరు కనిపించడంలేదు" అని అడిగాడు.

"ఔను, నాకు సర్వీసు సరిపోక ఈ ఏడాది ఎలిజిబిలిటీ లేదు. ఇంతకీ మీ ప్రమోషన్ ఏమయ్యిందీ?" అడిగాను.

"రాలేదు సార్, చిన్న పొరపాటు చేశాను" అన్నాడు.

"ఏమిటి ప్రమోషన్ పరిక్షకి సరిగ్గా ప్రిపేర్ కాలేదా?"

"కాదు"

"మరి?"

"నేను ఆ రోజు జగన్నాధుడి రథంలాగాను. మా జోస్యుడు నన్ను లాగమన్నది బలభద్రుని రథం తాడట. ప్రమోషన్ రాలేదన్న సంగతి ఆయనతో అంటే చెప్పాడు.."

బలరాం తన జాతకం గురించి చాలాసేపు ఇంకా ఏవేవో మాట్లాడాడు.

'అయినా ప్రమోషన్ ఇచ్చేవాళ్ళకి ఈ విషయాలు ఎలా తెలుస్తాయి పాపం' అనిపించింది నాకు.

రధయాత్ర ఎలా ఉన్నా ఏం చేసినా, జీవన యాత్రలో కావలసినవి తీరడానికి ఏం చెయ్యాలో ఈ మనుషులకి ఎలా తెలుస్తాయి...

Click here to share your comments